విశాలాంధ్ర కృష్ణా జిల్లా

ఇంటర్ పరీక్షలు ప్రారంభం

విశాలాంధ్ర-కూచిపూడి: ఈనెల 20వ తారీకు వరకు జరిగే ఇంటర్ పరీక్షల్లో భాగంగా తొలి రోజైన శుక్రవారం సీసీ కెమెరాల నడుమ మొదటి పరీక్ష ప్రారంభమైంది. క్షేత్రయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులు హడావిడిగా కచ్చితమైన సమయానికి తరలివచ్చారు. ఉదయం 9 గంటల నుంచి ప్రారంభమయ్యే సెకండ్ లాంగ్వేజ్ పేపర్1 పరీక్షకు అరగంట ముందుగా ఎనిమిదిన్నర గంటలకి కళాశాల ఆవరణలోకి పిల్లలకు ప్రవేశం కల్పించారు. తొలి రోజు 169మందికి 160 మందిహాజరైనారు. అవనిగడ్డ నుంచి తరలివచ్చిన సిట్టింగ్ స్క్వాడ్ మూడు గంటల పాటు పరీక్షా కేంద్రంలోనే గడిపారు. ఈ పరీక్షలకు ఇన్విజిలేటర్లుగా వివిధ గ్రామాలలో గల మండల పరి షత్ పాఠశాలలో పనిచేసే 9 మంది ఉపాధ్యాయులను నియమించారు. కళా శాలలో సి.ఎస్. కె.మహేష్ బాబు, డి.వో ఏ.శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

కూచిపూడినాట్య పరిశోధనలో 'వెంకు'కు బంగారు పతకం

విశాలాంధ్ర-కూచిపూడి: కూచిపూడి నాట్యాచార్యులు, బిస్మిల్లా ఖాన్ యువ పురస్కార్ అవార్డు గ్రహీత డాక్టర్ వేదాంతం వెంకటా చలపతి (వెంకు) కూచిపూడి నాట్యం పైచేసిన పరిశోధనకు డాక్టరేట్‌తో పాటు తొలిసారిగా బంగారు పతకం వరించింది. ఈ విషయాన్ని శుక్రవారం పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం కూచిపూడి శ్రీ సిద్దేంద్ర యోగి నాట్యకళాపీఠం ప్రధానాచార్యులు డాక్టర్ వేదాంతం రామలింగ శాస్త్రి తెలిపారు. వేదాంతం వెంకటా చలపతి తెలుగు విశ్వవిద్యాలయం నృత్య శాఖ నుండి 2023 విద్యా సంవత్సరానికి "గొల్ల కలాపం సాహిత్య సామాజికప్రాయోగిక సిద్ధాంత గ్రంథానికి" విశ్వవిద్యాలయ పరిధిలోనే తొలిసారిగా బంగారు పతకం లభించిందని వెల్లడించారు . ఈ పతకాన్నివిశ్వవిద్యాలయం కులపతి గానున్న తెలంగాణ గవర్నర్ తమిళసై సౌందర్య రాజన్, ఉపకులపతి ఆచార్య తంగిడి కిషన్ రావులచేతుల మీదుగా అందుకున్నట్లు వివరించారు. కూచిపూడి అగ్రహారానికి చెందిన వెంకటాచలపతిని భాగవత మేళా యక్షగాన కేంద్రం ప్రతినిధులు, నాట్యాచార్యులు పసుమర్తి రత్తయ్య శర్మ, డాక్టర్ వేదాంతం రాధేశ్యాం, డాక్టర్ చింతా రవి బాలకృష్ణ, డాక్టర్ ఏలేశ్వరపు శ్రీనివాసులు, కళాపీఠం గ్రంథాలయ పాలకులు వైవి ఫణికుమార్ అభినందించారు.

టీడీపీలోకి భారీగా చేరికలు

విశాలాంధ్ర - గుడివాడ : స్థానిక 17వ వార్డుకు చెందిన మరీదు రాహుల్ నేతృత్వంలో టీడీపీ ఇంచార్జ్ వెనిగండ్ల రాము సమక్షంలో మూడు వందల మందికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. శుక్రవారం 17వ వార్డుకు చెందిన మరీదు రహుల్‌కు వార్డు బాధ్యతలను అప్పజెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, పట్టణాధ్యక్షుడు దింట్యాల రాంబాబు, నాయకులు డాక్టర్ గోర్జి సత్యనారాయణ, గోకవరపు సునీల్, యార్లగడ్డ సుధారాణి, మరీదు విజయలక్ష్మి, పెద్దు వీరభద్రరావు, షేక్ జానీ, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటి

విశాలాంధ్ర - గుడివాడ : పట్టణంలో 15,19వ వార్డులో శుక్రవారం బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమాలు జరిగాయి. టీడీపీ ఇన్‌చార్జి వెనిగండ్ల రాము, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, జనసేన నాయకులు బూరగడ్డ శ్రీకాంత్‌లు ఇంటింటికి తిరుగుతూ ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ టీడీపీ అధ్యక్షుడు దింట్యాల రాంబాబు, జనసేన అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు, నాయకులు వేమూరి త్రినాథ్, సాయన రాజేష్, పోలాసి ఉమామహేశ్వరరావు, పంచుమర్తి శ్రీనివాసరావు, వల్లభనేని రత్నకుమార్, పలిశెట్టి శ్రీను, కోవెలకారు సూరిబాబు, పిడుగు గోపి, కొండా రాంబాబు, షేక్ మున్నా, తదితరులు, పాల్గొన్నారు.

సీఎం సభకు తరలిన ప్రజలు

విశాలాంధ్ర-పెదపారుపూడి: ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఇంటర్ పైబడి చదువుతున్న విద్యార్థులకు మూడో విడత అందించే విద్య దీవెన నియోజకవర్గ కేంద్రమైన పామర్రులో ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ అధ్యక్షతన జరిగే సభ కార్యక్రమమునకు పెదపారుపూడి మండలం నుంచి 40 బస్సులలో, 50 టాటా ఏసీలలో సుమారు నాలుగువేల మంది పైబడి ఎంపీపీ గోగం సురేష్ ఆధ్వర్యంలో తరలి వెళ్లినట్లు ఎంపీడీవో టీ సీతా మహాలక్ష్మి ఒక ప్రకటనలో శుక్రవారం తెలిపారు.

జగన్ సభకు వెళ్లిన కాలేజీ విద్యార్థులు

విశాలాంధ్ర -కూచిపూడి: పామర్రులో శుక్రవారం ముఖ్య మంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో కొనసాగిన జగనన్న విద్యా కానుక కార్యక్రమానికి మొవ్వ వీఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ మరియు పీజీ కళాశాల విద్యార్థిని విద్యార్థులు 60 మందికి పైగా తరలివెళ్లారు. ఆ కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ ఎస్.మాధవి సూచనలతో అధ్యాపకులు డాక్టర్ ఎం.సుందరరావు(పొలిటికల్ సైన్స్), డాక్టర్ సిహెచ్ ఆనంద్ కుమార్ (కామ ర్స్), ఫిజికల్ డైరెక్టర్ వి మణి ప్రసాద్‌ల పర్యవేక్షణలో విద్యార్థులు తరలి వెళ్లారు. రెండో సంవత్సరం బీఎస్సీ విద్యార్థిని కే పావని కీర్తి(బీటీ బీసీ)కి మిగిలిన కళాశాలలోని పిల్లలతో పాటు జగనన్న విద్యా కానుక చెక్కును ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చేతుల మీదుగా తీసుకోవడానికి డయాస్ పైకి వెళ్లే అవకాశాన్ని అధికారులు కల్పించారని డాక్టర్ కే మాధవి తెలిపారు.

బలవంతంగా ప్రజల్ని తరలించడం దుర్మార్గం

విశాలాంధ్ర-పమిడిముక్కల: ముఖ్యమంత్రి జగన్ రెడ్డి పర్యటనంటే ప్రజాధనం వృథా చేసింది కాక ఆయనోక రాజు అయితే ప్రజలు బానిసలా అన్నట్టు బలవంతంగా ప్రజల్ని తరలించడం దుర్మార్గమని పామర్రు నియోజకవర్గ తెలుగు దేశం, జనసెన పార్టీల ఉమ్మడి అభ్యర్థి వర్ల కుమార రాజా అన్నారు. శుక్రవారం నమ్మితాలగుంటలో పల్లెబాట కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ ప్రజలను పథకాల పేర ముఖ్యమంత్రి జగన్ రెడ్డి భయపెడుతూ, బ్లాక్ మెయిల్ చేస్తూ సభలకు ప్రజలను తరలిస్తున్నారని విమర్శించారు .పామర్రు ప్రజలు మిమ్మల్నిమీ పార్టీ నీ తరిమి కొడతానికి సిద్ధంగా ఉన్నారని, సొంత చెల్లినే ఏడిపించే మీరు పేద ఆడపిల్లల కష్టాలు ఎలా తీరుస్తారని ప్రశ్నించారు.ఎ న్నికలు సమీపిస్తుండటంతో ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ కొత్త డ్రామాలు ప్రారంభించారని , దీనికి తెరదించాలని మీరు బొక్కిన అవినీతి ప్రతి పైసా కక్కిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాజులపాటి శ్రీనివాస రావు కె.బాబ్జి గంజాల శివ కృష్ణ, వెంకట్రామయ్య గోల్డ్ మెన్ ఘంటా సురేష్ మరియు జనసెన నాయకులు కార్యకర్తలు అభిమానులు మహిళలు పాల్గొన్నారు.

కరపాటి సత్యనారాయణ మృతి..

విశాలాంధ్ర-మచిలీపట్నం: ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు కరపాటి సత్యనారాయణ శుక్రవారం అనారోగ్యంతో ఆయన మృతి చెందారు. స్థానికు ఓగిస్ పేటలోని తన నివాసం వద్ద సత్యనారాయణ పార్థివ దేహాన్ని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ, సిపిఐ జిల్లా కార్యదర్శి తాటిపర్తి తాతయ్య, సిపిఐ నాయకులు మోదుమూడి రామారావు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అధ్యక్షులు తాటిపర్తి రామకృష్ణ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి యర్రం శెట్టి ఈశ్వరరావు, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి లింగం ఫిలిప్, ఏఐటీయూసీ పట్టణ అధ్యక్షులు బెల్లంకొండ కోటేశ్వరరావు, ఏఐటీయూసీ పట్టణ ప్రధాన కార్యదర్శి ఒంటి పులి లక్ష్మణరావు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు వై. శ్రీమన్నారాయణ, సిపిఐ పెడన నియోజకవర్గ కార్యదర్శి తుమ్మ చిన్న కొండయ్య, సిఐడియూ జిల్లా కోశాధికారి బూర సుబ్రహ్మణ్యం, సిఐటియు పట్టణ కార్యదర్శి

ప్రముఖుల సంతాపం

చిరువోలు జయరావు, మహిళా సమైక్య కార్యదర్శి ఒడుగు రత్నకుమారి, సిపిఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి ఒడుగు చైతన్య కుమార్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకురాలు శిరం శెట్టి లలిత, చొక్కాకుల బుల్లెమ్మ, విజయ, మున్సిపల్ అధికారులు, సచివాలయం సిబ్బంది సత్యనారాయణ సహచరులు వివిధ పార్టీ నాయకులు ప్రజా సంఘాలు సత్యనారాయణ పార్థివ దేహానికి జండా కప్పి, పూలమాలలు వేసి విప్లవ జోహార్లు అర్పించిన వారిలో ఉన్నారు.

వైసీపీ నాయకులు సంతాపం

సత్యనారాయణ మృతి పట్ల శుక్రవారం ఓగిసు పేటకు వచ్చి ఆయన పార్థివ దేహానికి వైయస్సార్ సిపి నియోజకవర్గ ఇన్చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) పూలమాలవేసి తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

సత్యనారాయణ మృతి కార్మికులకు తీరని లోటు

విశాలాంధ్ర-మచిలీపట్నం: కరపాటి సత్యనారాయణ మృతి కార్మికులకు తీరని లోటని పలువురు అన్నారు. ఆయన గతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం మృతి చెందారు. ఈయన రాష్ట్ర మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులుగా, ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులుగా మున్సిపల్ కార్మికుల సమస్యల పట్ల పూర్తి అవగాహన ఉండి ఏ అధికారి వచ్చిన మున్సిపల్ కార్మికుల సమస్యలను వివరించి సమస్యల పరిష్కారం అయ్యేందుకు ఆయన వంతు కృషి చేసేవారు. అదే విధంగా రెల్లి కుల రాష్ట్ర నాయకుడిగా, పట్టణ అధ్యక్షులుగా రెల్లి కుల సంక్షేమం కోసం అవిశ్రాంతంగా కృషి చేశారు. ఈయనకు భార్య ఇద్దరు కుమారులు ఒక కుమార్తె ఉన్నారు. ఏ రాజకీయాలతో సంబంధం లేకుండా అన్ని రాజకీయ పార్టీలతో సత్సంబంధాలు కొనసాగిస్తూ కార్మికులు, రెల్లి కుల సంక్షేమం కోసం ఆయన కృషి చేశారు. ఈయన మరణ వార్త తెలియగానే నలుమూలల నుండి మున్సిపల్ కార్మికులు, రెలీ కుల పెద్దలు వచ్చి శ్రద్ధాంజలి కట్టించారు. నేటి ఉదయం 11 గంటలకు ఓగీస్ పేట నుండి అంతిమయాత్ర ప్రారంభమవుతుంది.

ఏఐటీయూసీ ప్రగాఢ సానుభూతి

మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి కరపాటి సత్యనారాయణ మృతి కార్మికులకు తీరని నష్టమని, ఆయన కార్మికుల సమస్య లపై అవగాహన కలిగి సమస్యల పరిష్కరించడంలో ఆయన కృషి మరువలేనిదని పట్టణ మున్సిపల్ వర్కర్స్ ఏఐటియుసి అధ్యక్ష, కార్యదర్శులు తాటిపర్తి రామకృష్ణ, యర్రంశెట్టి ఈశ్వరరావు సంతాపం ప్రకటిస్తూ వారి ఆశయాలను ముందుకు తీసుకు వెళ్ళడానికి మనందరం ఐక్యంగా కృషి చేయాలని తెలిపారు.

కార్మికుల సమస్యలు పట్టని ప్రభుత్వాలను ఇంటికి పంపుదాం

విశాలాంధ్ర-పెనమలూరు : కార్మికుల సమస్యలు పరిష్కరించడం చేతకాని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను ఇంటికి పంపుదామని పెనమలూరు నియోజకవర్గం పార్టీ కార్యదర్శి మున్నంగి నరసింహారావు అన్నారు. పెనమలూరు నియోజకవర్గ ఏఐటీయూసీ కమిటీ ఆధ్వర్యంలో పెద్దపులి పాక గ్రామంలో ఎస్టీ బీసీ మైనార్టీ వర్గాలకు చెందిన 50 మంది ఆటో కార్మికులు ఏఐటీ యు సీలో చేరారు. పెద్దపులిపాక కరకట్ట వంతెన సెంటర్లో ఏఐటీయూసీ అనుబంధంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆటో వర్కర్స్ యూనియన్ ఏర్పాటు చేసుకుని ఆటో వర్కర్స్ యూనియన్ స్టాండ్ ను ఏఐటియుసి గౌరవాధ్యక్షులు కామ్రేడ్ జ్యో జి బాబు ప్రారంభించారు. అనంతరం ఏఐటియుసి కండవాలను పెనమలూరు నియోజకవర్గం పార్టీ కార్యదర్శి మున్నంగి నరసింహారావు కార్మికుల మెడలో వేసి స్వాగతించారు. ఈ సందర్భంగా జిల్లా ఏఐటీయూసీ నాయకులు మున్నంగి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈరోజు కేంద్రంలోనూ రాష్ట్రంలోనూ ఆటో కార్మికుల సమస్యలను పరిష్కారం చేయమని ఏఐటియుసి ఆధ్వర్యంలో ఆటో కార్మికులు పోరాటాలు నిర్వహిస్తున్నప్పటికీ ప్రభుత్వాలు పెడచెవిని పెడుతున్నాయన్నారు. కార్మికుల సంక్షేమం పట్టించుకోకుండా సమస్యలు పరిష్కారం చేయకుండా ఆటో కార్మికులను ఇబ్బంది పెడుతున్న నేపథ్యంలో ఏఐటియుసి ద్వారా ఆటో కార్మికుల సమస్యలు పరిష్కారం చేసుకోవడానికి ప్రభుత్వం మెడలు వంచే పోరాటాలకు కార్మికులు సిద్ధం అవ్వాలన్నారు. పెద్ద పులిపాక డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులుగా జ్యో జి బాబు నే అధ్యక్షులుగా, సిహెచ్ రాం బాబు ప్రధాన కార్యదర్శిగా, జాన్ సైదా కోశాధికారిగా, షేక్ కరీముల్లా వైస్ ప్రెసిడెంట్గ, శంకర్ ఆర్గనైజింగ్ సెక్రెటరీగ, చందు, రాజా, ప్రవీణ్ లు జాయింట్ సెక్రెటరీలుగా కార్మికులచే ఎన్నికైనారు. ఈ సభలో పెనమలూరు నియోజకవర్గ ఏఐటీయూసీ కార్యదర్శి మట్ట మహేష్, కోశాధికారి గొడవర్తి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ హయాంలోనే మహిళా సాధికారత: యార్లగడ్డ

విశాలాంధ్ర-గన్నవరం: రాష్ట్రంలో టిడిపి అధికారంలో ఉన్నప్పుడు మహిళా సాధికారత వెల్లివిరిసిందని గన్నవరం నియోజకవర్గ టిడిపి అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావ్ అన్నారు. గన్నవరం ఏబీ కన్వెన్షన్ హాల్లో శుక్రవారం తెలుగు మహిళ ఆధ్వర్యంలో 'మీతో మీ నాయకుడు' చర్చావేదిక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న యార్లగడ్డ మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలపై లైంగిక దాడులు పెరిగిపోయాయని, దేశం మొత్తం మీద చుస్తే మన రాష్ట్రంలోనే మహిళలపై ఎక్కువ దాడులు జరగటం సిగ్గుచేటు అన్నారు. ప్రతిరోజు రాష్ట్రంలో ఏదో ఒక చోట మహిళలపై దాడులు జరుగుతూనే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలకు భద్రత కల్పించడంలో ఈ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. టిడిపి అధికారంలో ఉన్నప్పుడు మహిళల కోసం ప్రత్యేక చట్టాలు చేసిందని గుర్తు చేశారు. రాష్ట్రంలో డ్వాక్రా సంఘాలను ప్రవేశపెట్టి మహిళల ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు చంద్రబాబు నాయుడు కృషి చేశారని తెలిపారు. మహిళా పారిశ్రామికవేత్తల కోసం ప్రత్యేక పథకాలు రూపొందించారని గుర్తు చేశారు. మహిళలకు రుణ వసతి కల్పించి వారిని పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు టిడిపి ప్రభుత్వం కృషి చేసిందని చెప్పారు. మహిళల ఆర్థిక స్వావలంబనకు తెలుగు తెలుగుదేశం ప్రభుత్వం చేసిన కృషిని అన్నారు. విద్యార్థినిలను ఐటీ వైపు ప్రోత్సహించి వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించిన ఘనత తెలుగుదేశం ప్రభుత్వానికి దక్కిందన్నారు . ఈ కార్యక్రమంలో గన్నవరం నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు మేడేపల్లి రమ ముల్పూరి సాయి కళ్యాణి, మండవ లక్ష్మి, చిక్కవరపు నాగమణి, మండవ రమ్య, గరికిపాటి నాగా లక్ష్మి, పొదిలి లలిత, కంబంపాటి లక్ష్మి, బస్సే సరిత, గుజ్జరలపూడి అజిత, కోనేరు రమమణి, చట్టు నాగమణి, వెంకటేశ్వరమ్మ, సుభాషిణి, క్రాంతి,మల్లేశ్వరీ,రాధికా, శాంతమ్మా, వెంకట దుర్గ, సులోచన,దామాయతి,గుడ్డేటి సుమతి, పొట్లూరి జ్యోతి, బేతల ప్రమీలరని, వల్లభనేని నాగమణి, చిన్నం శ్రీదేవి, వడ్డీల్లి లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్ వెంటనే రద్దు చేయాలి

విశాలాంధ్ర-అవనిగడ్డ : రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు ఉపాధ్యాయులు, పెంక్షనర్లు, సమస్యలు పరిష్కరించడంలో తీవ్ర అనాశక్తి కనబరుస్తుందని వెంటనే సి.పి.ఎస్ రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ పెడరేషన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ, ఉద్యోగ, పెంక్షనర్ల సమస్యలను పరిష్కరించడంలో ఆశక్తి చూపడం లేదని ఆర్థిక ప్రయోజనాలు సకాలంలో పొందలేకపోతున్నారని మంజూరు చేయకపోగా మంజూరు అయిన వాటి బకాయిలు విడుదల చేయడంలో తీవ్ర జాప్యం జరుగుతుందని దాచుకున్న సొమ్ము అవసరం కొరకు వాడుకునే విషయంలో కూడా నిధులు మంజూరు చేయడంలో తీవ్రంగా కాలాయాపన జరుగుతుందన్నారు. సమస్యల పరిష్కారం కోరుతూ తాలుకా కేంద్రాల వద్ద దర్నా నిర్వహించి పలు డిమాండ్‌లతో కూడిన వినతి పత్రాలను సమర్పించారుడ. వారి ప్రధాన డిమాండ్‌లు అయిన సి.పి.ఎస్.రద్దు చేయాలి, పెండింగ్‌లో ఉన్న రెండు కొత్త డిఎ లు తక్షణమే విడుదల చేయాలని 12వ పిఆర్‌సిలో మధ్యాంతర భృతి 30 శాతం తక్షణమే చెల్లించాలని, 11 వ పిఆర్‌సి బకాయిలు విడుతల వారిగా కాకుండా ఏకమొత్తంలో ఒకేసారి చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ఆంధ్రప్రదేశ్ టీచర్స్ పెడరేషన్ రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి నాయకులు పాల్గోన్నారు.

నేడు క్వాలిటీ ఏస్యూరెన్స్ సెల్ ఇంటరాక్షన్ ప్రోగ్రాం

విశాలాంధ్ర-గుడ్లవల్లేరు: ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ఉన్నత విద్యను మార్పు చేసే విధంగా విశ్లేషణాత్మక నైపుణ్యాలు, వ్యవస్థాపకత మరియు సంఘసేవ వంటి అనేక కార్యక్రమాలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి నిర్వహిస్తుందనీ, అందులో భాగంగా మార్చి రెండవ తేదీన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్య మండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ కె. రామ మోహన రావు శేషాద్రి రావు గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాలకు విచ్చేసి, యువత సాధికారత సాధించుటకు ఉన్నత విద్యలో వచ్చిన సంస్కరణలు (రిఫామ్స్ ఇన్ హైయర్ ఎడ్యుకేషన్- అన్లీషింగ్ యూత్ ఎంపవర్మెంట్) అను అంశంపై ప్రసంగిస్తారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బుర్రా కరుణ కుమార్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి క్వాలిటీ ఎస్యురెన్స్ సెల్ నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి స్థానిక శేషాద్రి రావు గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కాలేజీ వేదిక కానుంది.

జగన్ సభకు భారీగా తరలిన ప్రజలు

విశాలాంధ్ర-కూచిపూడి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి శుక్రవారం పామర్రులోహాజరైన జగనన్న విద్యా కానుక కార్యక్రమానికి భారీ సంఖ్యలో మొవ్వమండలం నుంచి వేలసంఖ్యలో ప్రజలు తరలి వెళ్లారు. మండలంకుపామర్రుఎం.ఎల్.ఏ.అనిల్.కుమార్ 100 ఆర్టిసి బస్సులు ఏర్పాటు చేశారు. మండలంనుంచి 7,300కుపైగాడ్వాక్రా మహిళలనుఈ సభకు తరలించారని సమాచారం!!. ఎం.డి.ఓ. జి.చంద్రశేఖరావు, పర్యవేక్షణలో ఏ.పి.ఎం.సి.హెచ్. ప్రధానరావు ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, డ్వాక్రా గ్రూప్ నాయకురాళ్ళు ఈ కార్యక్రమంలో పాల్గొని బస్సులలో ఎక్కించారు. అలాగే ఆ పార్టీ నాయకులు పలువురిని బస్సుల ద్వారా పంపించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

విశాలాంధ్ర -కూచిపూడి: మొవ్వ మండలములోని పెదముత్తేవి శ్రీ లక్ష్మీ పతి స్వామి విద్యా విహార్ విద్యా విహార్ సంస్థ తోన్నత విద్యా లయ 9వతరగతి విద్యార్థినులు గైడ్ టీచర్ కొడాలి రాని పర్యవేక్షణలో రూపొందించిన రూపొందించిన"పర్యావరణ రహిత కుండి"రాష్ట్రస్థాయి పోటీలకు తరలి వెళ్లనున్నది. ఆ పాఠశాల విద్యార్థులు పి. రసమాధురి, కే తులసి, కే సువర్చల తయారుచేసిన"వ్యవస్థాపక మనస్తత్వ అభివృద్ధి కార్యక్రమం"లో భాగంగా అందుబాటులోనున్న వనరులను ఉపయోగించుకుని రూపొందించిన"పర్యావరణ రహిత కుండి"జిల్లాస్థాయి ప్రదర్శన లో పాల్గొని రెండో బహుమతి పొంది రాష్ట్ర పోటీలకు ఎంపికైంది. ఈవిషయాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కే మాధవి విలేకరులకు తెలిపారు. ఈనెల6-7 తారీకులలో పోరంకి (విజయవాడ)లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన అంశాన్ని పరిశీలించిన ఆ పాఠశాల కరస్పాండెంట్, ముముక్షుజన మహా పీఠాధిపతి ముక్తేవి గౌరవ కృష్ణ, ఆ విద్యార్థులను, గైడ్ టీచర్ గైడ్ టీచర్ కొడాలి రాణి లను అభినందించారు. గతంలో రాష్ట్రస్థాయిలో రెండవ స్థానానికి సాధించిన పర్యావరణహిత పెన్నును కూడా తయారు చేసింది ఈ పాఠశాల విద్యార్థులు కావడం విశేషం!!.

వైద్య ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

విశాలాంధ్ర-విజయవాడ: వైద్య రంగంలో పని చేస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష ,కార్యదర్శులు వి బాలయ్య, ఏ.గిరిబాబులు ఏపీ హెల్త్ మెడికల్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ స్పెషల్ చీఫ్ సెక్రటరీఎంటీ. కృష్ణ బాబును కోరారు. శుక్రవారం ఏపీ సచివాలయం బ్లాక్ నెంబర్ 5 నందు వైద్య ఉద్యోగుల సమస్యలపై ఉద్యోగ సంఘ నాయకులతో జాయింట్ మీటింగ్ జరిగింది. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు వైద్య ఉద్యోగుల సమస్యలు గత కొన్ని సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న 18 డిమాండ్లను ముందుగా రిప్రజెంటేషన్ ఇచ్చి అదనపు అజెండా కింద చేర్చి చర్చించారు. వైద్య రంగంలో ఎటువంటి పదోన్నతులు లేకున్నా అలాగే రిటైర్డ్ అవుతున్న క్యాటగిరి వారికి లాబ్ సూపర్వైజర్, ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్-1, చీఫ్ రేడియోగ్రాఫర్ పోస్టులను అన్ని జిల్లా ఆస్పత్రిలో, టీచింగ్ ఆసుపత్రిలో,వైద్య కళాశాలలో మంజూరు చేయాలన్నారు. డైటీషియన్ పదోన్నతులు కల్పించాలని కోరారు. 114 జీవో ప్రకారం కాంట్రాక్టు ఉద్యోగులు అందరిని తక్షణమే క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. అర్హులైన నాన్ మెడికల్ అసిస్టెంట్, జూనియర్ అనలిస్ట్‌లకి నాన్ మెడికల్ అసిస్టెంట్ గెజిటెడ్ పదోన్నతులు కల్పించాలన్నారు. వైద్య రంగంలో ఒప్పంద విధానంలో పనిచేసే పారామెడికల్ సిబ్బంది, నర్సింగ్ సిబ్బందికి,35 రోజుల సాధారణ సెలవులు మంజూరు చేయాలన్నారు. వైద్య రంగంలో పని చేసే మహిళా ఉద్యోగులకు 5 రోజుల స్పెషల్ క్యాజు వల్ లీవ్ మంజూరు చేయాలని కోరారు. డైరెక్టర్ సెకండరీ హెల్త్ సర్వీసు రేడియాలజీ విభాగంలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలన్నారు. 18 సంవత్సరా లుగా అవుట్‌సోర్సింగ్ ప్రాతిపదికన పనిచేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్-2 ఫార్మసిస్ట్ గ్రేడ్-2, రేడియోగ్రాఫర్ లుగా పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ సిబ్బందిని కాంట్రాక్ట్ పద్ధతిలోకి మార్చాలని విజ్ఞప్తి చేశారు. జీవో 549ని అమలు చేసి శానిటేషన్ వర్కర్లకు రూ. 16000/- వేతనం, పీఎఫ్, ఈఎస్ఐ చెల్లించాలన్నారు. నర్సింగ్ స్టాఫ్ హెడ్ నర్స్, స్టాఫ్ నర్స్‌గా ఉన్న నామకరణాన్ని సీనియర్ నర్సింగ్ ఆఫీసర్‌గా మార్చాలని సూచించారు. కాంట్రాక్టు బేసిస్‌లో పనిచేస్తున్న ఉద్యోగులకు 100% వేతనం బేసిక్ పే, డీఏ, హెచ్ఆర్ఏ మంజూరు చేయాలన్నారు. ఈ అంశాలపై స్పందించిన సెక్రెటరీ కృష్ణ బాబు మాట్లాడుతూ తన పరిధిలో ఉన్న అన్ని సమస్యలను పరిష్కరిస్తారని, మిగిలిన డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కే శేషయ్య పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారమే లక్ష్యం: ఏపీ ఎన్జీవోస్

విశాలాంధ్ర,విజయవాడ (గాంధీనగర్) : ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, ఔట్సోర్సింగ్ కాంట్రాక్ట్ ఉద్యోగుల పక్షాన వారి సమస్యలను పరిష్కరించేందుకు, సమస్యలపై రాజీ లేని పోరాటం చేస్తున్న ఏపీ ఎన్జీవోస్ సంఘానికి రాష్ట్ర అధ్యక్షులుగా ఎన్నిక చేయటంపట్ల కె.వి శివారెడ్డి సంతోషాన్ని వ్యక్త పరిచారు. ఏపీ ఎన్జీవోస్ సంఘానికి రాష్ట్ర అధ్యక్షులుగా కెవి శివారెడ్డి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సిహెచ్ పురుషోత్తమ నాయుడు నూతనంగా ఎన్నికైన సందర్భంగా గాంధీనగర్ లోని ఏపీ ఎన్జీవో హెూమ్‌లో శుక్రవారం ఏపీ రవాణాశాఖ ఉద్యోగుల సంఘం జోనల్ అధ్యక్షులు ఎం.రాజుబాబు ఆధ్వర్యంలో సంఘ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా శివారెడ్డి, పురుషోత్తం నాయుడు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలపై ఏపీ జేఏసీ ప్రభుత్వం దగ్గర పెట్టిన 49 డిమాండ్లలో కొన్నింటిని ఈనెల 31 లోపు పరిష్కరిస్తున్నామని ప్రభుత్వం వ్రాత పూర్వకంగా ఇచ్చిందని ఇకనైనా ప్రభుత్వం వాటిని చిత్తశుద్ధితో అమలు చేయాలన్నారు. శాంతి యుతంగా చేపట్టిన ధర్నా కార్యక్రమంలో పాల్గొన్న నాయకులపై పెట్టిన పోలీసు కేసులను ఎత్తివేయాలని కోరారు. వివిధ శాఖలలో ఉద్యోగుల సంబంధించిన చాలా సమస్యలు పెండింగ్లో ఉన్నాయని వాటిని త్వరగా పరిష్కరించే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామన్నారు. రవాణాశాఖ ఉద్యోగుల సంబంధించిన కొన్ని సమస్యలపై ఇప్పటికి రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడామని త్వరలోనే వాళ్ళ సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు. ఏపీ రవాణాశాఖ ఉద్యోగుల సంఘం జోనల్ అధ్యక్షులు రాజుబాబు మాట్లాడుతూ రవాణాశాఖ ఉద్యోగులకు సంబంధించిన సమస్యలపై ఏపీ జేఏసీలో మాట్లాడడం అన్ని వర్గాలకు న్యాయం చేకూరేలా సమస్యలను పరిష్కరించాలని కోరడం జరిగిందన్నారు. వాటిని పరిష్కరించే దిశగా ఏపీ ఎన్జీఓస్ సంఘం, ఏపీ జేఏసీ సహకరించినందుకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాం అన్నారు. రాష్ట్ర ఎన్జీవోస్ అధ్యక్ష కార్యదర్శులతో పాటుగా రాష్ట్ర సంఘం ఉపాధ్యక్షులు రమణ, తూర్పు కృష్ణ జిల్లా అధ్యక్షులు ఉల్లి కృష్ణ ఉన్నారు. ఈ కార్యక్రమంలో రవాణాశాఖ ఉద్యోగుల రాష్ట్ర సంఘం కోశాధికారి ఎం.ఆనంద్ కుమార్, జోనల్ కార్యదర్శి కెవివి నాగ మురళి, సహకక్షరాలు జి ఉషాసుందరి, సంఘ సభ్యులు యం రవితేజ, కె లోకేష్ పాల్గొన్నారు.

కటికల కుటుంబ సభ్యులకు మండలి పరామర్శ

విశాలాంధ్ర-అవనిగడ్డ : కటికల కుటుంబ సభ్యులను తెలుగుదేశం పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మండలి వెంకట్రామ్ పరామర్శించారు. మండల పరిధిలోని అశ్వరావుపాలెం గ్రామంలో ఆ పార్టీ నాయకులు కటికల వెంకట సుబ్బమ్మ ఇటీవల అకాల మరణం చెందడంతో మండలి వెంకట్రామ్ పరామర్శించి వెంకట సుబ్బమ్మ చిత్రపటా నికి పూలమాలలు వేసి ఘన నివాళ్ళు అర్పించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పంద్రాజు నాగ వెంకట లంకమ్మ ప్రసాద్, దాసినేని మురళి, బచ్చు రఘునాథ్, కొండవీటి పాండురంగారావుల పలువురు పాల్గొన్నారు.

ఆపదలో ఉన్న వారికి అండగా టీఎస్‌కే నాయుడు

విశాలాంధ్ర-అవనిగడ్డ : ఆపదలో ఉన్న వారికి అండగా నేనున్నానంటూ నిరంతరం ప్రజా సేవలో తరిస్తున్న అవనిగడ్డ 6వ వార్డుకు చెందిన శ్రీరామ వెల్ఫేర్ సొసైటీ కన్వీనర్ తోట శ్యామ్ కిషోర్ నాయుడు సింహాద్రి కాలనీలో నిరుపేద కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు. ముళ్ళపూడి వెంకటేశ్వరరావు తన రెండు కిడ్నీలకు సమస్య రావడంతో హటాత్తుగా మరణించాడు. భార్య వెంకట నరసమ్మ వెన్ను సమస్యతో బాధపడుతూ ఆర్థిక సమస్యలతో తీవ్ర ఇబ్బందులకు ఎదుర్కొంటున్న విషయం నాయుడు దృష్టికి స్థానికులు తీసుకువచ్చారు. వెంటనే స్పందించి శుక్రవారం వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులను పరామర్శించి ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీసి తన వంతు సాయంగా 5 వేల రూపాయల నగదును వెంకట నరసమ్మకు అందచేశారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ మాజీ వార్డు సభ్యులు దేగల రాఘవ, సొసైటీ సభ్యులు, తోట నరసింహానాయుడు, ముళ్ళపూడి నాగేశ్వరరావు, అల్లపర్తి గోపి, మోపిదేవి కోటేశ్వరరావు, సాయి ఫణీంద్రలతో పాటు పలువురు పాల్గొన్నారు.

కరపాటి మృతి కార్మిక లోకానికి తీరని లోటు

విశాలాంధ్ర-మచిలీపట్నం టౌన్: కరపాటి మృతి ఆయన కుటుంబానికే కాక కార్మిక లోకానికి తీరని లోటని అని ఏఐటీయూసీ గౌరవ అధ్యక్షులు లింగం ఫిలిప్ అన్నారు. శుక్రవారం ఆయన మృతదేహాన్ని సందర్శించి శ్రద్ధాంజలి ఘటించిన అనంతరం మాట్లాడుతూ, మున్సిపాలిటీలో కార్మికులుగా పనిచేస్తూ నాయకునిగా ఎదిగిన ఆయన ఎన్నో విషయాలలో కార్మికులకు అందుబాటులో ఉంటూ కార్మిక నాయకుడు అయ్యాడని, అతను భౌతికంగా లేకపోయినా కార్మికుల మనసులో ఉంటాడని, ఆయన మృతికి సంతాపం వ్యక్తం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ మచిలీపట్నం అధ్యక్షుడు వి.కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి ఓ.ఎల్. రావు, పాల్గొన్నారు.

లైంగిక కుటీరాలుగా విద్యాలయాలు

విశాలాంధ్ర-అవనిగడ్డ : విద్యా బుద్ధులు నేర్పించాల్సిన విద్యాలయాలు లైంగిక కుటీరాలుగా మారుతున్నాయని మాలమహానాడు జిల్లా అధ్యక్షులు దోవా గోవర్ధన అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ విద్యార్థులపై ఉపాధ్యాయులు లైంగిక వేధింపులు అంటూ తరచూ వింటున్న ఘటనలు తల్లిదండ్రుల కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయని, ఈ వ్యవస్థపై ప్రజలకు నమ్మకాలు సన్నగిల్లేలా చేస్తున్నాయని, ఇటీవల ఎక్కువ శాతం మైనర్ బాలికలను వేదించిన కీచక ఉపాధ్యాయులు అనే వార్తలు ఎక్కువగా వెలుగులోకి వస్తున్నాయన్నారు. విద్యను వ్యాపార సముదాయాలుగా భావించి నడిపిస్తున్న సంస్థల ప్రతినిధుల నిర్లయాలే దీనికి ముఖ్య కారణం అన్నారు. అసలు కులం, మతం లైంగిక కీచక పర్వం లేని విద్యాలయాలు చూడగలమా అనే సందేహం కల్గుతుందని, విద్యా వ్యవస్థలో వీటిపై ప్రక్షాలన జరగాలని లైంగిక దురాచారాలను రూపుమాపాలని, అందు కోసం బాధితుల తరుపున న్యాయ పోరాటానికి సంఘం పరంగా నిలుస్తామని దోవా అన్నారు.

పురిటిపాడులో జగనన్న ఆరోగ్య సురక్ష

విశాలాంధ్ర-గుడ్లవల్లేరు: మండలంలోని పురిటిపాడు గ్రామ సచివాలయ పరిధిలో రాష్ట్ర ప్రజలందరూ ఆరోగ్యంగా వుండాలనే సదాశయంతో గౌరవ ముఖ్యమంత్రి వర్యులు వై ఎస్ జగన్ మోహన్ రెడ్డి తలపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష రెండవ విడత కార్యక్రమము శుక్రవారం జరిగినది. ఈ కార్యక్రమమునకు పురిటిపాడు గ్రామ పంచాయతీ పరిధిలో ఇంటింటీకి, సిహెచ్ఐలు, ఎఎన్ఎమ్ లు మరియు వాలంటీర్ లు నిర్వహించిన సర్వేలో గుర్తించిన 278 మందిని శిబిరానికి తీసుకోని వచ్చి వారికి ప్రభుత్వ వైద్యులు మరియు వైద్య సిబ్బందిచే పరీక్షలు నిర్వహించి అవసరమగు మందులు ఉచితంగా పంపిణీ చేయడం జరిగింది. కంటి పరీక్షలు చేసి అవసరం ఉన్న వారికి కళ్ళ జోళ్ళు అందజేయడం జరిగినది.ఈ కార్యక్రమములో మండల వైఎస్సార్సీపీ నాయకులు కోటప్రోలు నాగు, స్థానిక సర్పంచ్ కాగిత నరేంద్ర బాబు,ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు, డాక్టర్ మరియు వైద్య సిబ్బంది, పురిటిపాడు పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది, గ్రామ పంచాయతీ సిబ్బంది, వాలంటీర్లు, గ్రామంలోని ప్రజలు అధిక సంఖ్యలో హాజరై, ప్రభుత్వం గ్రామ గ్రామన కల్పిస్తున్న ఆరోగ్య సురక్షా కార్యక్రమము ప్రజలందరిలో ఆరోగ్యాన్ని నింపే ఓ గొప్ప కార్యక్రమం చేపట్టిందని, రెండవ విడత చేపట్టినందుకు సంతోషం వ్యక్తం చేసారు.

మొవ్వ మండలంలో పెన్షన్ పంపిణీ

విశాలాంధ్ర-కూచిపూడి: మొవ్వ మండలంలో వైయస్సార్ ఫెంక్షన్ కానుక పంపిణీ తొలి రోజు శుక్రవారంనత్తనడక నడిచింది. దీనికి కారణం ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పామర్రు జగనన్న విద్యా కానుక పంపిణీ రావడంతో వాలంటీర్లు ఆ కార్యక్రమానికి హాజరవటంతో సకాలంలో పంపిణీలు జరగలేకపోయాయి. మండలంలోని 16 సచివాలయాలలో 8851 పెన్షన్ కి 3715 పెన్షన్లు పంపిణీ అయ్యాయి.

దీనికి తగ్గట్టుగానే ఉదయం 6 గంటల నుంచి సర్వర్ సేవలు మొరాయించటంతో సాయంత్రానికి కేవలం 41.95 శాతం మాత్రమే పంపిణీ అయినట్లు అధికార వర్గాల సమాచారం. ప్రతినెలా ఈపాటికి పంపిణీ90%దాటేది. ఉదయం నుంచి పామర్రులో వాలంటీర్లు జనాలను తీసుకెళ్లే ప్రయత్నంలో ఉండటంతో పింఛను పంపిణీ సకాలంలో చేయలేకపోయారు.

సర్టిఫికెట్లు పోయినవి

కృష్ణాజిల్లా, బంటుమిల్లి మండలం, ములపర్రు గ్రామానికి చెందిన **తీరం స్రవంతి, భర్త గొల్లనపల్లి ఏడుకొండలు** అను నేను ములపర్రు గ్రామంలోని ఇంటివద్ద నుండి ఒరిజినల్ 10వ తరగతి మార్కుల సర్టిఫికెట్, టి.సి. సర్టిఫికెట్లను ఫోటోస్టాట్ తీయించుకొనుటకు ఇంటివద్దనుండి దగ్గరలోని బంటుమిల్లి గ్రామానికి బయలుదేరాను. ఫోటోస్టాట్ షాపు వద్దకు వెళ్లిచూడగా సర్టిఫికెట్ల కవరు కనిపించలేదు. అవి దారిలో ఎక్కడో జారిపడిపోయినవి అని గుర్తించాను. దయచేసి ఎవరికైన దొరికినచో ఈ క్రింది అడ్రసుకు తెలియపరచగలరని ప్రార్థిస్తున్నాను.

తీరం స్రవంతి, భర్త గొల్లనపల్లి ఏడుకొండలు
ములపర్రు గ్రామం, బంటుమిల్లి మండలం,
కృష్ణాజిల్లా, సెల్ నెం: 90635 83990.

పశ్చిమ సీటుపై సీపీఐ ఫోకస్

విశాలాంధ్ర-విజయవాడ: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో విజయవాడ పశ్చిమ నియోజకవర్గం సీటుపై సీపీఐ దృష్టి పెట్టిందని సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు తెలిపారు. చెరువు సెంటర్ లోని సీపీఐ కార్యాలయం ఉప్పలపాటి సుబ్బరాజు భవన్‌లో శుక్రవారం కె.పిచ్చయ్య అధ్యక్షతన గట్టువెనుక డివిజన్ల కమిటీ సభ్యుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ పార్టీ కేడర్ ఎన్నికలకు సిద్ధం కావాలని, ఈ ప్రాంతంలో ఇప్పటి నుండే ప్రచారం ప్రారంభించాలని పిలుపునిచ్చారు. అభ్యర్థిగా ఎవరిని ప్రకటించినా సీపీఐ గెలుపుకోసం కృషి చేయాలన్నారు. నగరాభివృద్ధిలో సీపీఐ చేసిన కృషిని ప్రజలకు వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శివర్గ సభ్యులు పంచదార్ల దుర్గంబ, కార్యవర్గ సభ్యులు బుద్దె రాజా తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి సంఘాల నాయకుల అరెస్టు

విశాలాంధ్ర-తిరువూరు: ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో సీఎం క్యాంప్ ఆఫీస్‌ను స్టూడెంట్స్ యూని యన్ లీడర్స్ ముట్ట డించడానికి వెళుతున్న ఎన్టీఆర్ జిల్లా తిరువూరు ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు ఎస్కే సుభాని, ఏఐవైఎఫ్ మాజీ నాయకులు మాల పాటి ఉదయలను పోలీసులు గురువారం అర్ధరాత్రి 11 గంటల సమ యంలో ముందస్తు అరెస్టు చేశారు. సీఎం కాంప్ ఆఫీస్ ముట్టడితో తమ సమస్యలను తెలియజేయాలని కోరుకున్నారు. ప్రజలకు కార్యాలయ సిబ్బందికి, రహదారిపై వెళ్ళు వాహనదారులకు అంతరాయం కలుగుతుందని ప్రభుత్వ ఆస్తులకు నష్టం, ఇతర నేరాలు జరగవచ్చని, శాంతి భద్రతలకు భంగం కలుగుతుందని పోలీసులు ముందస్తు అరెస్టు చేయడం జరిగింది. ఏఐవైఎఫ్ నాయకులు మాట్లాడుతూ ప్రత్యేక హెూదా చేతకాని ఎంపీలు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలి



విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: కార్మికుల సంక్షేమం కోసం గతంలో ఏర్పాటు చేసిన కార్మిక సంక్షేమబోర్డును ప్రభుత్వం పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ విస్సన్నపేటలో భవన నిర్మాణ కార్మికులు శుక్రవారం ఆందోళన చేశారు. స్థానిక గాంధీబొమ్మ సెంటర్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా రహదారిపై నిర సన ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు వి.నాగరాజు, ఎం.జ్ఞానరత్నం, ఆకుల శ్రీనివాస రావు, మర్రిబోయిన అప్పారావు, పోతురాజు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కేయూ నూతన రిజిస్ట్రార్‌గా శోభన్ బాబు

విశాలాంధ్ర బ్యూరో-మచిలీపట్నం: విశ్వవిద్యాల యం నూతన రిజిస్ట్రార్ గా ఆచార్య కె శోభన్ బాబు నియమితుల య్యారు. నరసరావు పేట జే ఎన్ టి యూ ఇంజినీరింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్, మాథెమాటిక్స్ విభాగం ఆచార్యులుగా పనిచేస్తున్న కె శోభన్ బాబు శుక్రవారం భాద్యతలు స్వీకరించారు. సహాయ ఆచార్యులు గా జే ఎన్ టి యూ అనంతపురం, కాకినాడ ఇంజినీరింగ్ కళాశాలలో, సహా ఆచార్యులు గా విజయనగరం విధులు నిర్వర్తించారు. నూతన రిజిస్ట్రార్ గా భాద్యతలు స్వీకరించిన శోభన్ బాబు ను ఉపకులపతి ఆచార్య జి జ్ఞానమణి అభినందించారు. అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది నూతన రిజిస్ట్రార్ ను అభినందించారు.

ప్రజలు, కులాల మధ్య చిచ్చు పెట్టే పార్టీలు వద్దు

విశాలాంధ్ర,విజయవాడ (గాంధీనగర్) : దేశ సమగ్రత, సమభావం, సత్వర సుస్థిర అభివృద్ధి నిర్మాణం కోసం యూనియన్ స్టేట్స్ ఆఫ్ సోషలిస్ట్ అలయెన్స్(థర్డ్ ఫ్రంట్) ప్రణాళికలో విప్లవాత్మకమైన ప్రగతిశీల అభివృద్ధికర పది చట్టాలను చేరుస్తున్నట్టు థర్డ్ ఫ్రంట్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు, ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దేవరపల్లి మహేష్ తెలిపారు. శుక్రవారం గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ అధ్యక్షుని హెూదాలో ఎన్నికలకు సిద్ధమై ఎన్టీఆర్ జిల్లా పార్లమెంట్ అభ్యర్థిగా ప్రజల ముందుకు వస్తున్నానని సహృదయంతో ఆదరించాలని కోరారు. విభజించి పాలించే ప్రభుత్వాలు, అందుకు సహకరించి కులాల మధ్య చిచ్చుపెట్టి చీలికలు తీసుకువచ్చే నాయకత్వం మాకు అవసరం లేదని స్పష్టం చేశారు. ప్రజల ఆయుష్షు శ్రేయస్సు ఆత్మ ధైర్యాన్ని పెంపొందించే నాయకత్వాన్ని స్వాగతిస్తామని అన్నారు. ఇప్పటివరకు నాయకులు ప్రజలను కులాలుగా విభజించి సంఘాలుగా పోషించి ఓటు బ్యాంకు గానే వాడుకున్నారన్నారు. తాను మాత్రం ప్రజా ప్రతినిధిగా ఎన్నికవ్వ దానికి ముందే నా కులం కార్డుని మీడియా ముఖంగా వదిలేస్తున్నాన న్నారు. ఈ కార్యక్రమంలో లాల్ భీమ్ అధినేత కొప్పుల విజయబాబు, ఐపీసీ జాతీయ నాయకులు నామిని భాస్కర్. జాతీయ నాయకులు కట్ట రమేష్ రాష్ట్ర కార్యదర్శి గోగిరెడ్డి అంజనీదేవి, తెలంగాణ ఆఫీస్ ఇంచార్జ్ నంది కొండలరావు, ఐపీసీ నాయకులు ఫణి రాజ్ పాల్గొన్నారు.

రేపు పల్స్‌పోలియో

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: మండలంలో ఈనెల 3వ తేదీన పల్స్‌పోలియో కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల వైద్యాధికారి డా.విజయలక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా 46 శిబిరాలు, ఒక సంచార శిబిరం ఏర్పాటు చేసి, నాలుగు రూట్లుగా విభజించామన్నారు. మండల వ్యాప్తంగా మొత్తం 4,147మంది చిన్నారులకు పోలియో చుక్కల మందు అందించేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు ఆమె వివరించారు.

కనకదుర్గ దేవాలయంలో ప్రత్యేకపూజలు

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: విస్సన్నపేట ద్వారకానగర్‌లోని కనకదుర్గ దేవాలయంలో 24వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని, శని, ఆదివారాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా మహా కుంబాభిషేకం, సామూహిక కుంకుమార్చన పూజా కార్యక్రమాలు, అన్నసమారాధన కార్యక్రమాలు చేపట్టనున్నామని వారు వివరించారు.

వరుస చోరీలతో బెంబేలెత్తుతున్న లారీ యజమానులు

విశాలాంధ్ర-కంచికచర్ల: పట్టణంలో రహదారులు పక్కన ఆగి ఉన్న లారీలను టార్గెట్ చేసి బ్యాటరీలను పట్టాలను దొంగతనాలు జరుగుతున్నాయి. ఇటీవల చెవిటికల్లు వెళ్లే రోడ్లో పార్కు చేసిన లారీలో బ్యాటరీలు దొంగతనం జరిగినట్లుగా సమాచారం. అదేవిధంగా గత రాత్రి కంచికచర్ల పట్టణంలోని ప్రధాన రహదారి అయిన జుజ్జూరు రోడ్డు నందు రాత్రి సమయంలో స్థానిక లారీలను నిలిపివేసి ఇంటికి వెళ్లిపోవడంతో ఇదే అదునుగా లారీకి ఉన్న బ్యాటరీలు, పట్టాలు దొంగతనం జరిగినట్లుగా గుర్తించిన లారీ యజమానులు కంచికచర్ల పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. పట్టణంలో నిత్యం పెట్రోలింగ్ నిర్వహించి దొంగలను పట్టుకొని చోరీ జరిగిన సొత్తు రికవరీ చేయాలని లారీ యజమానులు కోరుతున్నారు.

పేద విద్యార్థులకు ఉన్నత విద్యే లక్ష్యం: కలెక్టర్



విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : విద్యకు పేదరికం అడ్డుకాకుడదన్న లక్ష్యంతో పూర్తి ఫీజు రీయంబర్సు మెంట్‌తో పేద విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించేందుకు రాష్ట్ర ప్రభుత్వం జగనన్న విద్యా దీవెన పథకాన్ని అమలు చేస్తోందని జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. స్థానిక కలెక్టర్ కార్యాలయంలో 2023, అక్టోబర్, నవంబర్, డిసెంబర్ త్రైమాసికానికి సంబంధించి జగనన్న విద్యా దీవెన ఫీజు రీయింబర్స్‌మెంట్ చెక్కు శుక్రవారం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యా ప్రమాణాలను మెరుగు పర్చేందుకు అధిక ప్రాధాన్యతనిస్తున్నారన్నారు. నాడు-నేడు పథకం ద్వారా పాఠశాలల రూపురేఖలనే మార్చివేయడం జరిగిందన్నారు. అత్యాధునిక మౌలిక వసతులను ఏర్పాటు చేసి ప్రాథమిక విద్య నుండే శ్రాస్త సాంకేతిక పరిజ్ఞానం మెరుగు పర్చటం ద్వారా విద్యార్థులకు నాణ్యత ప్రమాణాలతో కూడిన విద్యను అందిస్తున్నామన్నారు. జగనన్న అమ్మఒడి, విద్యా దీవెన, వసతి దీవెన, విద్యాకానుక, జగనన్న గోరుముద్ద వంటి పథకాలు ద్వారా ప్రతీ పేద విద్యార్థి ఉన్నత విద్యను అభ్యసించేలా ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. ఐటిఐ, డిప్లమా, డిగ్రీ ఆపై ఉన్నత విద్యను అభ్యసించే ప్రతి విద్యార్థికి విద్యా దీవెన పథకం సువర్ణ అవకాశం లాంటిందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో చదివే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. జిల్లాలో ఐటిఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజనీరింగ్, బిఇడి, అగ్రికల్చర్, మెడికల్, నర్సింగ్ విద్యను అభ్యసిస్తున్న 37,178 మంది విద్యార్థులకు రూ.31.72 కోట్లు అందించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో నగర్ మేయర్ బాగ్యలక్ష్మి, నగర డిప్యూటీ మేయర్లు శ్రీశైలజారెడ్డి, బెల్లం దుర్గా, వివిధ కార్పొరేషన్ చైర్మన్‌లు, సాంఘీక సంక్షేమ శాఖ డీడీ విజయభారతి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కిరణ్మయి, డ్వామా పీడీ సునీత, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా నిర్వహిస్తున్నాం

జిల్లాలో ఇంటర్ పరీక్షలను అత్యంత కట్టుదిట్టమైన ఏర్పాట్లతో ప్రశాంతంగా నిర్వహిస్తున్నామని, తొలిరోజు మొదటి సంవత్సరం పరీక్షకు 99 కేంద్రాల ద్వారా 39,544 మంది విద్యార్థులకుగాను 38,822 మంది హాజరయినట్లు జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు తెలిపారు. జిల్లాలో ప్రారంభమైన ఇంటర్ పరీక్షల నిర్వహణను కలెక్టర్ శుక్రవారం పరిశీలించారు. స్థానిక బిషప్ అజరయ్య జూనియర్ కళాశాల, శ్రీశారద కళాశాలలో నిర్వహిస్తున్న పరీక్షా కేంద్రాలను ఆయన సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇంటర్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ప్రతి పరీక్షా కేంద్రం గదిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయటంతో పాటు పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాలలోకి ఎటువంటి ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించడం లేదని, విద్యార్థులను క్షుణ్ణంగా పరీక్షించి మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడకుండా పటిష్ట చర్యలు తీసుకున్నామన్నారు. ఒక్కో పరీక్షా కేంద్రానికి ఒక చీఫ్ సూపెరిండెంటెంట్, 2 ఫ్లైయింగ్ స్క్వాడ్స్, 2 సిట్టింగ్ స్క్వాడ్స్‌ను, 3,500 మంది ఇన్విజిలేటర్లను నియమించామన్నారు. పరీక్షా కేంద్రాల్లో నిరంతరం విద్యుత్ సరఫరా, త్రాగు నీరు తదితర సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్ష హాజరయ్యే విద్యార్థుల సౌకర్యార్థం ఏపీఎస్ఆర్‌టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.

ఇళ్ల పేరుతో పేదల్ని అప్పుల పాలు చేసిన జగన్



విశాలాంధ్ర - జగ్గయ్యపేట : ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఎక్కడ మాట్లాడినా, ఎప్పుడు మాట్లాడినా దాదాపు 2 లక్షల 80వేల కోట్ల రూపాయలు రాష్ట్ర ప్రజలకి సంక్షేమాన్ని అందించానని పదే పదే చెప్పుకుంటున్నాడని, ఎక్కడా కూడా రాష్ట్ర అభివృద్ధి గురించి మాట్లాడటం లేదని టిడిపి విజయవాడ పార్లమెంట్ ఇంచార్జి నెట్టెం రఘురామ్ విమర్శించారు. శుక్రవారం ఆయన స్వగృహం లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో జగన్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. రఘురామ్ మాట్లాడుతూ ఇతరత్రా పెట్టుబడులు, పరిశ్రమల గురించి గాని, ఏమాత్రం పల్లెత్తు మాట అనకుండా కేవలం సంక్షేమం జపం తప్ప మరొకటి కాదని అన్నారు. ఇది పెత్తందారులకు, పేదవారికి మధ్య క్లాస్ వార్ అని చెబుతావున్నాడు, మనం చూసినట్లయితే చాలా విషయా లున్నాయి జగన్ ఏదైతే ప్రజలకు వాగ్దానం చేసి నేటికీ నెరవేర్చనటువంటి లేక అరకొరగా చేసినటువంటి అనేక కార్యక్రమాల్లో ఈ ఇళ్ల నిర్మాణం ఒక్కటన్నారు. దాదాపు 33 లక్షల ఇళ్లు కడతానన్న ముఖ్యమంత్రి, ఇప్పటికి ఎన్ని ఇళు కట్టాడు అన్నదానికి ప్రభుత్వం నుంచి లెక్క చెప్పలేదన్నది కనపడుతున్న వాస్తవమన్నారు. గత చంద్రబాబు ప్రభుత్వంలో ఈ రాష్ట్రంలో ఏడున్నర లక్షల టిడ్కో గృహాల నిర్మాణం చేపట్టి, ప్రభుత్వం దిగిపోయే నాటికి 2లక్షల 60వేల టిడ్కో ఇళ్లు దాదాపు పూర్తైపోయిన దశలో వాటన్నింటిని జగన్‌మోహన్‌రెడ్డి మూలనపెట్టి, ఈ రోజుకి లబ్ధిదారులకు ఇవ్వని పరిస్థితి అన్నారు. దేశంలో పక్కా ఇళ్ళ నిర్మాణం ఎన్టీ రామారావు గారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రారంభమైందని ఓటీఎస్ వన్ టైం సెటిల్ మెంట్ పేరుమీద ఆరోజు ఎన్టీ రామారావు కట్టించిన ఇళ్ల దగ్గర నుంచి మొన్న 2019 దాకా ఆయా ప్రభుత్వాలు కట్టించిన ఇళ్లపై ఓటీఎస్ పేరు మీద 10వేల నుంచి 30వేల దాకా వసూలు చేసి ఏం చేశాడో, ఎక్కడ ఖర్చు పెట్టాడో అర్థంపర్థం లేని రీతిలో ఈ ప్రభుత్వాన్ని జగన్ నడిపాడన్నారు. ఆనాడు జగన్ తండ్రి కూడా ఇళ్ల నిర్మాణం పేరు మీద 4వేల కోట్ల కుంభకోణం చేశారని గుర్తుచేశారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర గ్రీవెన్స్ సెల్ కో కన్వీనర్ ముల్లంగి రామకృష్ణారెడ్డి, నూజివీడు నియోజకవర్గ రాష్ట్ర పరిశీలకుడు గింజుపల్లి రమేష్ జగ్గయ్యపేట మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కట్టా వెంకట నరసింహారావు ఎన్టీఆర్ జిల్లా తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధులు తాళ్లూరు వెంకటేశ్వర్లు షేక్ అన్వర్ ఎన్టీఆర్ జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షులు మొగిలి శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు సంకా వెంకట్రావు పాల్గొన్నారు.

వార్డులో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు

విశాలాంధ్ర - జగ్గయ్యపేట : పట్టణంలోని 31 వార్డులలో గడిచిన రెండేళ్లలో సుమారు 27 కోట్ల రూపాయలతో నిర్మించిన సీసీ రోడ్లు, డ్రెయిన్లు, మంచినీటి పైప్ లైన్లు తదితర అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలు ఘనంగా జరిగాయి. శుక్రవారం ఉదయం 8 గంటల నుండి సాయంత్రం వరకు జగ్గయ్యపేట పట్టణంలో అన్ని వార్డుల నందు ఈ ప్రారంభోత్సవాలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర ప్రభుత్వ విప్ శాసనసభ్యులు సామినేని ఉదయభాను, యువనాయకులు సామినేని వెంకట కృష్ణ మరియు ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు పెద్ద సంఖ్య లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ జగ్గయ్యపేట నియోజకవర్గాన్ని ఎక్కడా రాజీ పడకుండా అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. రోడ్లు, డ్రెయిన్లు, సచివాలయం, రైతు భరోసా కేంద్రాల నిర్మాణం తదితర పనులతో పట్టణాన్ని అభివృద్ధి పథం వైపు నడిపిస్తున్నామని చెప్పారు.

తెలంగాణలో మాదిరిగా ఆంధ్రా నాయకులు మోసపోవద్దు

విశాలాంధ్ర,విజయవాడ (గాంధీనగర్) : వైఎస్ షర్మిల చేతిలో ఆర్థికంగా నష్టపోయి రాజకీయ భవిష్యత్తును కోల్పోయిన తమ మాదిరిగా ఆంధ్రాలో నాయకులు ప్రజలు మోసపోవద్దని వైఎస్సార్ తెలంగాణ పార్టీ బాధితులు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా వైయస్సార్ పార్టీ అధ్యక్షులు లక్కినేని సుధీర్ బాబు మాట్లాడుతూ వైఎస్ షర్మిల తెలంగాణలో వైఎస్ఆర్ తెలంగాణ అనే పార్టీ పెట్టి ఏపీలో లాగా తెలంగాణలో కూడా రాజన్న రాజ్యం తెస్తానని, తాను రాజన్న బిడ్డను అంటూ వచ్చి నమ్మించిందన్నారు. అయితే అమె మురుసుపల్లి షర్మిలగా వైఎస్సార్ అభిమానులపై పగ సాధిస్తుందని అనుకోలేదని ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ అధ్యక్షురాలుగా ఉందని ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఏపీ ప్రజలు షర్మిలను నమ్మితే మీరు కూడా మోసపోతారన్నారు. ఆ పార్టీకి లక్షలు ఖర్చు పెట్టామని, కరోనా టైంలో కూడా నేను ఎన్నికల్లో నిలబడతానని మిమ్మల్ని కుడా నిలబెడతానని చెప్పి మోసం చేసింద న్నారు. రాబోయే ఏపీ అసెంబ్లీ ఎన్నికలలో తాము షర్మిలకు వ్యతిరేకంగా పనిచేస్తామని తెలిపారు. బానోతు రాజకుమార్, డేవిడ్ శాంతరాజ్ మాట్లాడుతూ షర్మిలతో పాదయాత్ర కూడా చేశామని, ఖమ్మం జిల్లా సంకల్ప సభకు 10 జిల్లాల నుండి అనేకమంది నాయకులను, కార్యకర్తలను సమీకరించి లక్షల మందితో సభ ఏర్పాటు చేశామన్నారు. ఈ సమావేశంలో కమ్మలి బాలరాజు,కొల్లి వెంకటేశ్వర్ రెడ్డి,దుర్గం నగేష్,తాడక జగదీశ్వర్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

అన్ రిజర్వ్‌డ్ రైల్వే టిక్కెట్లకు యూటీఎస్ యాప్ సులభమైన మార్గం

విశాలాంధ్ర,విజయవాడ (గాంధీనగర్) : ప్రయాణికులు క్యూలో వేచి ఉండకుండా అన్‌రిజర్వ్‌డ్ రైల్వే టిక్కెట్‌లను పొందడానికి యుటిఎస్ యాప్ సులభమైన మార్గం అని ఎస్సీ రైల్వే చీఫ్ కమర్షియల్ మేనేజర్ (సిసిఎం),ప్యాసింజర్ మార్కెటింగ్ (పిఎం), కె.సాంబశివరావు తెలిపారు. ప్రయాణికులు డిజిటల్ ,నగదు రహిత లావాదేవీలను ప్రోత్సహించే విధంగా వాణిజ్య సిబ్బంది ప్రోత్సహించాలని సూచించారు.శుక్రవారం డివిజ నల్ కార్యాలయంలోడివిజన్‌లోని కమర్షియల్ అధికారులు,సిబ్బందితో యుటిఎస్ మొబైల్ యాప్ వాటాను పెంపొందించడం,టిక్కెట్లులో డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహించడంపై సెమినార్ నిర్వహించారు. దీనికి సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ రాంబాబు వావిపల్లి అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ మొబైల్ యాప్‌లో యుటిఎస్ వినియోగంలో దేశంలోని అన్ని జోన్లలో దక్షిణ మధ్య రైల్వే ప్రస్తుతం రెండవ స్థానంలో ఉందని అన్నారు. జోన్‌వ్యాప్తంగా మొబైల్ టిక్కెట్‌లపై యూటీఎస్ వాటా 3.41% కాగా, జోన్ జారీ చేసిన మొత్తం అన్‌రిజర్వ్‌డ్ టిక్కెట్లలో ఏటీవీఎం వాటా 33.79%గా ఉందన్నారు. విజయవాడ డివిజన్‌లో సిబ్బంది మొత్తం అన్‌రిజర్వ్‌డ్ టికెట్లలో 3.3% వాటా సాధించినందుకు అభినందనలు తెలిపారు.యుటిఎస్ యాప్,ఎటివిఎమ్ఎస్ ద్వారా 2023-24 ఆర్థిక సంవత్సరానికి (ఏప్రిల్ నుండి జనవరి వరకు) మొత్తం అన్‌రిజర్వ్ చేయని టిక్కెట్లలో 26% వాటా ఉందన్నారు.ప్రయాణికుల్లో మొబైల్ యాప్‌ను స్వీకరించడం, ప్రధాన స్టేషన్‌లలో లభించే ఆటోమేటిక్ టిక్కెట్ వెండింగ్ మెషీన్‌ల (ఎటివిఎమ్ఎస్) వినియోగాన్ని పెంచడానికి తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు.

ఏడీఆర్ఎంగా ఎడ్విన్ బాధ్యతల స్వీకరణ

విశాలాంధ్ర,విజయవాడ (గాంధీనగర్) : విజయవాడ రైల్వే డివిజన్ అదనపు డివిజనల్ రైల్వే మేనేజర్‌గా(ఏడిఆర్ఎం, మౌలిక సదుపాయాలు) పి.ఇ. ఎడ్విన్ (ఐఆర్ఎస్ఈ) శుక్రవారం డివిజనల్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు.ఈయన ఇండియన్ రైల్వేస్ సర్వీస్ ఆఫ్ ఇంజనీర్స్ (ఐఆర్ఎస్ఈ) 2000 బ్యాచ్‌కి చెందినవారు. ఇంతకు ముందు త్రివేంద్రం సదరన్ రైల్వేలో గతి శక్తి చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్‌గా పనిచేశారు.2002లో నైరుతి రైల్వేలోని బంగారుపేటలో అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్‌గా భారతీయ రైల్వేలో ప్రవేశించారు. తన పదవీకాలంలో భారతీయ రైల్వేలోఅనేక కీలక పదవులు నిర్వహించారు. డివైగా పనిచేస్తున్నప్పుడు యలహంక హిందూపూర్ (83 కి.మీ) రైల్వే లైన్ డబ్లింగ్‌ను ప్రారంభించడంలో కీలకపాత్ర పోషించారు. చీఫ్ ఇంజనీర్ (నిర్మాణం), సౌత్ వెస్ట్రన్ రైల్వే ఆయన అత్యుత్తమ పనితీరుకు గతంలో జనరల్ మేనేజర్ అవార్డును కూడా అందుకున్నారు. పశ్చిమ బెంగాల్‌లోని కోల్‌కతాలోని ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇంజనీర్స్ (భారతదేశం) నుండి సివిల్ ఇంజనీరింగ్‌లో పట్టభద్రుడయ్యారు. ఆయన ఐఎన్ఎస్ఈఏడి సింగపూర్, ఐసిఎల్ఐఎఫ్ మలేషియాలో తన అడ్వాన్స్ మేనేజ్‌మెంట్ ట్రైనింగ్స్ కూడా చేసారు.ఇప్పటి వరకు ఏడిఆర్ఎంగా విధులు నిర్వహించిన డి. శ్రీనివాసరావు దక్షిణ మధ్య రైల్వే ప్రధాన కార్యాలయం సికింద్రాబాద్‌లో చీఫ్ ఇంజనీర్ (స్టేషన్ల అభివృద్ధి)గా నియమించారు.

మైనారిటీలకు రాజ్యాధికారం జగన్‌తోనే: ఆసీఫ్



విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ముస్లిం మైనారిటీలకు రాజ్యాధికారం దిశగా అనేక పదవులతో గౌరవిస్తున్నారని వైఎస్సార్ సిపి పశ్చిమ ఇంచార్జి ఆసిఫ్ అన్నారు. శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలలో ఆసిఫ్,జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మెన్ షేక్ గౌస్ మొహిద్దిన్ తో పాటు స్వాతి సెంటర్ లోని రజా మసీదులో పాల్గొన్నారు. స్థానిక ముస్లిం పెద్దలు ఆసిఫ్ ను,వక్ఫ్ బోర్డు చైర్మెన్ షేక్ గౌస్ మొహిద్దిన్ ను సత్కరించారు. ఈ సందర్భంగా ఆసిఫ్ మాట్లాడుతూ విదేశీ విద్య, షాదీ ముబారక్, ఫీజు రీయింబర్స్మెంట్. మైనారిటీలకు రాజ్యాధికారం దిశగా నడిపిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి తనకు ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం ఇచ్చారని మైనారిటీ సోదరులందరూ తనకు అండగా నిలిచి ఆశీర్వదించాలని కోరారు. గౌస్ మొహిద్దిన్ మాట్లాడుతూ జగన్ పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము కానీయకుండా ఆసిఫ్‌ను గెలిపించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఎండి ఇర్ఫాన్,బాజీ బాబా. అప్సర్ రసూల్ ఖాన్,షేక్ కలీం,అబ్దుల్ రఫి,షేక్ గౌసి,కరిముల్లా, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

మర్వాడీ వ్యాపారి ఇంట్లో భారీ చోరీ!

విశాలాంధ్ర-విజయవాడ (క్రైం): మార్వాడీ వ్యాపారి ఇంట్లో భారీ చోరీ జరిగింది. బీరువాలో ఉండాల్సిన రూ.40లక్షల నగదు, రూ.5లక్షల విలువ చేసే డైమండ్ నక్లెస్. రెండు కీలోల వెండీ కడ్డీలు మాయమైయ్యాయి. వన్‌టౌన్ శివాలయంవీధికి చెందిన సుశీలజైన్ తన భర్తతో కలిసి చెప్పుల వ్యాపారం నిర్వహిస్తున్నారు. తన వద్ద ఉన్న బంగారు అభరణాలు తాకట్టు పెట్టి రూ.33లక్షలు, చీటి పాటల ద్వారా వచ్చిన రూ.7లక్షల నగదు కలిపి జనవరి 31వతేదీ తమ ఇంట్లోని బీరువాలో ఉంచారు. మళ్లీ ఫిబ్రవరి 7వతేదీన బీరువా తెరిచి చూసేసరికి దానిలో ఉండాల్సిన రూ.40లక్షల నగదుతో పాటు బంగారు నక్లెస్, వెండీ కడ్డీలు కనిపించలేదు. దీంతో బాధితురాలు వారం రోజుల క్రిందట విజయవాడ వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఈ వ్యవహారం పై పోలీసులు కేసు నమోదు చేయకుండా అత్యంత గోప్యంగా విచారణ చేస్తున్నట్లు సమాచారం.

ఎఫ్25 ప్రో ఆవిష్కరించిన ఒపో్పో

విశాలాంధ్ర - విజయవాడ (వన్ టౌన్): ఒప్పో ఇండియా ఎఫ్25 ప్రో 5జీని రెండు స్టోరేజ్ వేరియంట్‌లలో విడుదల చేసింది. వరుసగా రూ. 23,999 (128జీబీ), రూ. 25,999 (256జీబీ) వద్ద రిటైల్ చేయబడింది. ఈ స్మార్ట్‌ఫోన్ కొత్త లావా రెడ్ కలర్‌లో అందుబాటులో ఉంది. దీని ముందు, వెనుక షూటర్‌లలో 4కె వీడియో రికార్డింగ్‌తో 64 ఎంపీ వెనుక ట్రిపుల్ కెమెరా సెటప్, 6.7-అంగుళాల సరిహద్దులేని అమోఎల్ఈడీ డిస్‌ప్లే, వేగంగా ఛార్జింగ్ బ్యాటరీతో ఐపీ 65 రేటింగ్‌ను కలిగి ఉంది.

రాష్ట్రంలో మూడో ప్రత్యామ్నాయంగా ఏపీ యునైటెడ్ ఫ్రంట్ అవిర్భావం: జేడీ

విశాలాంధ్ర,విజయవాడ (గాంధీనగర్) : రాష్ట్రంలో ప్రస్తుతం సమాజంలో పరిస్థితులు ఏమి బాగాలేవని రెండు కుటుంబాల చేతిలో అధికార మార్పిడి ఉండటం వలన పేదలు మరింత పెదలుగా మారిపోతున్న పరిస్థితులు చూస్తున్నామని దాంతో మూడో ప్రత్యామ్నాయం రావలసి అవసరం ఉందని ప్రజలు గ్రహించటంతో ఏపీ యునైటెడ్ ఫ్రంట్ ఏర్పాటు చేశామని జై భారత్ నేషనల్ పార్టీ అధ్యక్షులు వి.వి.లక్ష్మీనారాయణ(జెడి) తెలిపారు. శుక్రవారం గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం సమాజం లో పరిస్థితులు ఏమి బాగాలేవన్నారు. రాష్ట్రంలో ఆర్థిక సంక్షోభం ఎక్కువగా ఉందన్నారు. ఆర్థిక సంక్షోభం ఎక్కువగా ఉన్నప్పుడు నియంతలు అవుతారని, దేశంలోనూ రాష్ట్రంలోనూ విచ్చలవిడిగా ఖర్చు చేస్తున్నారని, వీటిని ఎదుర్కొనడం కోసం ఈ కూటమిలో జై భారత్ పార్టీ,లెబరేషన్ కాన్గ్రెస్ పార్టీ,ఎటిపి పార్టీ,జాతీయ సమ సమాజం పార్టీ ప్రబుద్ధ రిపబ్లికన్ పార్టీలు కలిసి ఏపీ యునైటెడ్ ఫ్రంట్‌గా ఏర్పడ్డామన్నారు. ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టాలని, ఉచిత పథకాలు ఇవ్వడంలో అన్ని పార్టీలు పోటీ పడుతున్నాయని, ఉచితంగా ఇచ్చినప్పుడు రాష్ట్రంలో తెల్ల రేషన్ కార్డులు ఎందుకు పెరిగిపోతున్నాయన్నారు. 90 నుంచి 95% వరకు ప్రజలు ఓటు వేయాలని అప్పుడే మంచి ప్రభుత్వం ఏర్పడుతుందని ఓటు వెయ్యని వారి చేత ఓటు వేయించడమే మా ప్రధాన లక్ష్యం అని అన్నారు. రాబోయే కాలంలో అభ్యర్థులను ప్రకటిస్తామన్నారు. ఏపీ యునైటెడ్ ఫ్రంట్ కో- ఆర్డినేటర్ డా. రఘు మల్లేపల్లి మాట్లాడుతూ రాష్ట్రంలో రెండు కుటుంబాలు ఆదిపత్యంలో ఉంటున్నాయని నాలుగు పార్టీలు రెండు కుటుంబాలని ఇది దౌరభాగ్య పరిస్థితి అన్నారు. ప్రజలు గత్యంతరం లేక పెత్తందారులకు ఓట్లు వేస్తున్నారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు, అగ్రకుల పేదలుకు అనుకూలంగా 3వ ప్రత్యామ్యమయం ఏర్పడిందని, దీనికి ఏపీ యునైటెడ్ ఫ్రంట్ గా నామకరణం చేశామన్నారు. పేద ప్రజలకు స్వయంపాలన రావటం ఆకాంక్షాన్ని దీని దృష్టిలో పెట్టుకొని ఫ్రంట్ ఏర్పడిందని, దీనికి అధ్యక్షునిగా వి.వి లక్ష్మీనారాయణ ను నియమించామన్నారు. జై భారత్ నేషనల్ పార్టీ పోతిన వెంకట రామారావు,ఆల్ తెలుగు ప్రజా పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నమ్మి అప్పారావు యాదవ్, బీసీ చైతన్య సమితి రాష్ట్ర అధ్యక్షులు బీసీ రమణ పాల్గొన్నారు.

విశాలాంధ్ర ఎన్టీఆర్ జిల్లా

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు ప్రారంభం

విశాలాంధ్ర- కంచికచర్ల: ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు కంచికచర్ల మండలంలో ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. మండలంకు సంబంధించి మొత్తం నాలుగు సెంటర్లలో పరీక్షలు ప్రారంభమయ్యాయి. మొత్తం 938 విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా,56 మంది విద్యార్థులు గైర్హాజరు కాగా 882 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు.స్థానిక ఇమాక్యులేట్ కళాశాలలో 162 మంది విద్యార్థు లకు 157 మంది విద్యార్థులు పరీక్షలు వ్రాయగా ఐదుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారు.ఎన్ టి ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 180 మంది విద్యార్థులకు,150 మంది పరీక్షలు వ్రాయగా,30 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. దీక్ష జూనియర్ కళాశాలలో 250 మంది విద్యార్థుల కుగాను, 241 మంది విద్యార్థులు పరీక్షలు వ్రాయగా, 9 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. కీసర బిజెటి కళాశాలలో 346 మందికి 334 మంది పరీక్షలు వ్రాయగా,12 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పరీక్షలు సందర్భంగా సంబంధిత అధికారులు అన్ని రకాల ఏర్పాట్లు చేశారు.

రామశంకర్ మృతి కళాకారులకు తీరని లోటు

విశాలాంధ్ర-విజయవాడ కల్చరల్: ఎంతోమంది పేద కళాకారులను ఆదుకుంటూ, పేదవారికి ఎందరికో సామాజిక సేవలందిస్తూ హఠాన్మరణం పొందిన డాక్టర్ ఒమ్మి రామశంకర్ మృతి కళా రంగానికి, పేద కళాకారులకు తీరని లోటని పలువురు వక్తలు పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం హనుమంతరాయ గ్రంథాలయంలో పలు కళా సంస్థల ప్రతినిధులు, కళాకారులు, కళాభిమానులు, కళా పోషకులు పలువురు రామశంకర్, ఇటీవలనే మృతి చెందిన జిలాని ఖాన్ చిత్రపటానికి పూలదండలు వేసి అంజలి ఘటించి సంతాప సభ నిర్వహించారు. మారేపల్లి జోషి, డేవిడ్ రాజు, బి.వి వీరభద్రరావు, ఎం వెంకటపతి, కొప్పుల అశోక్ ఆనంద్, జ్ఞాన కిషోర్, మాంతి రమణారావు, బిఎస్ఎన్ఎల్ శ్రీనివాసరావు, కీబోర్డు రవి, కారుమంచి రాజు, యాకోబు, చలపతిరావు తదితరులు మాట్లాడుతూ మురుగా చారిటబుల్ ట్రస్ట్ స్థాపించి చైర్మన్ గా రామశంకర్ ఎటువంటి ప్రతిఫలాపేక్ష లేకుండా కళా, సామాజిక, సాంఘిక సేవలందిస్తూ దాతృత్వానికి నిలువెత్తురూపంగా నిలిచారన్నారు. బి ఎస్ పి నుంచి విజయవాడ నగర మధ్య నియోజకవర్గ అభ్యర్థిగా ఎన్నిక కాబడిన మంచి మనిషి మనలనందరినీ విడిచి వెళ్లిపోవడం దురదృష్టమన్నారు. సినిమా దర్శకుడు, గాయకుడు, రచయిత, అన్నదాతగా అందరితో ఆప్యాయతలను పంచుకున్న ఆయన బేషజం తెలియని స్నేహశీలి, చిరుదరహాసి అని అన్నారు. అతి చిన్న వయసులోనే ఆయన మృతి చెందటం జీర్ణించుకోలేనిదన్నారు. చిందు, రూపశ్రీ గాయనీమణులకు తన చిత్రంలో పాడే అవకాశం కూడా కలిగించారన్నారు.

శ్రోతలపై వర్షించిన సినీ రాగాల సుస్వరాల జల్లు

విశాలాంధ్ర-విజయవాడ కల్చరల్: రాగలహరి సమర్పణలో శుక్రవారం సాయంత్రం కౌతా పూర్ణానందం కళావేదికపై జరిగిన చిత్ర గీతాలాపన శ్రోతలపై సురాగాలతో మేళవించిన సుస్వరాల జల్లును వర్షింపచేస్తూ సాగింది. బి.మీరాకుమార్ నేతృత్వంలో స్వాతి మీరా కుమార్, సూర్య కామేశ్వరి, రూపశ్రీ, షబన, అయ్యప్పన్, చంద్రశేఖర్, నాయక్ తదితరులు నాటి, నేటి, మేటి చిత్రాలలోని మహా కనకదుర్గా, స్వప్న వేణువేదో, కుశలమా నీవు, మేఘాలను తాకింది, అదిరింది మావ, వద్దంటే వినడే వంటి ఇత్యాది పాటలను శృతిలయల సమ్మేళనంగా సాహిత్యంలోని భావాన్ని శ్రోతలకు అనుభూతి కలిగించేలా పాడి వినిపించారు. వీరికి వాయిద్య సహకారం రవి బాబు, జయరాజు, ఇజ్రాయిల్, చిట్టిబాబు, ప్రవీణ్, కొండయ్య లు నిండుగా సహకరించారు. అతిథులుగా నిడుమోలు రమా సత్యనారాయణ, కొప్పరపు వెంకట బలరామకృష్ణమూర్తి, ప్రసూన రామన్, పరుచూరి విజయలక్ష్మి, చావా నరసింహారావు, చింతకాయల చిట్టిబాబు తదితరులు మాట్లాడుతూ మాతృ భాష వికాసానికి, కళా వికాసానికి ఇటువంటి పాటలతో కూడిన సినీ సంగీత విభావరులు ఎంతో దోహదం చేస్తాయని కళాకారులను అభినందించారు.

మార్కెట్ ఒడిదుడుకుల మధ్య ఆలిస్ బ్లూ నూతన విధానాలతో ప్రణాళిక

విశాలాంధ్ర-విజయవాడ: మదుపరులకు సహాయం చేయడానికి ఆలిస్ బ్లూ వెబ్‌నార్లు పోర్ట్‌ఫోలియో సేవల వంటి వనరులను అందిస్తుందనీ ఆ సంస్థ ఆర్థిక నిపుణులు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం జరిగిన వెబ్‌నార్‌లో వారు మాట్లాడుతూ నిఫ్టీ సరికొత్త మైలురాయిని చేరుకుందన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి 22న నిఫ్టీ 22,252.5 ఆల్ టైం గరిష్ట స్థాయిని చేరుకొని కొత్త మైలు రాయిని నమోదు చేసి, 22,217.45 వద్ద ముగియటంతో పెట్టుబడిదారులు తదుపరి కదలిక గురించి యోచిస్తున్నారన్నారు. రాబోయే ఏప్రిల్, మే నెలలో సాధారణ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో మార్కెట్ కొత్త విధానాలు ఎంచుకుంటున్నారు. ఆలిస్ బ్లూ ఈ మార్కెట్‌ను బాగా అధ్యయనం చేసి మదుపరులకు అవసరమైన సేవలు అందిస్తుందన్నారు. స్టాక్‌ను ఎంపిక చేసేటప్పుడు , మార్కెట్ గరిష్ట స్థాయికి చేరినపుడు, లాభాలను కాపాడుకోవటానికి సరియైన వ్యూహం అవసరం ఉంటుందన్నారు. ట్రేడింగ్, పెట్టుబడి నైపుణ్యాలను పెంపొందించడంలో మార్కెట్ అప్ ట్రెండ్‌లో, వెనుకంజలో ఉన్నప్పుడు మదుపరులు తమ లాభాలను కాపాడుకోవడంలో సహాయపడుతుందన్నారు. ఆర్థిక లక్ష్యాలు పెట్టుబడిపైన రాబడి (ఆర్ఓఐ) కాంపౌండ్ వార్షిక వృద్ధి రేటు (సీఏజీఆర్) వంటి వాటి గురించి సమగ్ర పునః పరిశీలన, పెట్టుబడిని రీకక్యాలిబ్రేట్ చేయుటకు ఆధునిక ఫైనాన్సియల్ విధానాలు అనుసరిస్తూ ఆలిస్ బ్లూ అనేక అదనపు ఫీచర్లతో వారికి మద్దతు అందిస్తుందని తెలిపారు.

ప్రకటన

నా క్లయింటున్నూ ఆదిత్య ఫార్మ డిస్ట్రిబ్యూటర్స్, భవానీపురం, జోజినగర్, రిప్రజెంటెడ్ బై మేనేజింగ్ పార్టనర్ సూరేపల్లి ఫణి కోటేశ్వరరావు, తండ్రి. దుర్గారావు గారి సంజాయిషీ పొంది యావన్మందికి తెలియజేయునది ఏమనగా... నా క్లయింటు ది.29-02-2024న ఉదయం గం.11.00ల సమయములో తన ఫరమ్ పేరున గల హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్, గొల్లపూడి బ్రాంచి అకౌంట్ నెం.50200043230192 గల చెక్కు బుక్‌లోని 000010, 000011 సంతకం చేసియున్న పై రెండు చెక్కులను ఒక బ్రౌన్ కవర్‌తో పెట్టి తన పై జేబులో పెట్టుకొని తన ఆఫీసు నుండి స్వాతి థియేటర్ సెంటర్‌కు వెళ్లుచుండగా గుప్తా సెంటర్ వద్దకు వచ్చి చూసుకొనగా తన జేబులోని సంతకం చేసియున్న చెక్కులు వున్న కవర్ కనపడలేదు. ఎంతవెదికిననూ దొరికియుండలేదని తెలియ జేయుచున్నారు. కావున సదరు చెక్కులు ఎవరికైననూ దొరికిన యెడల నా క్లయింటు అడ్రస్‌లో గానీ, ఈ క్రింది అడ్రస్‌లో గానీ అందజేసి తగిన పారితోషికం పొందగలరు.

పిళ్లా సుధాకర్, న్యాయవాది
డి.నెం.9-3-17, బ్రాహ్మణ వీధి, కొత్తపేట,
విజయవాడ-1. సెల్: 9246464756